క్లుప్తంగా

జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో, జిల్లాస్థాయి పరుగు పందెం పోటీలను బుధవారం వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ పోటీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహీధర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సుమారు 120 మంది అథ్లెట్లు ఈ పోటీలో పాల్గొనగా, అత్యంత ప్రతిభ చూపిన 30 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. ఎంపికైన వారిని, జూన్ 6న హన్మకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కోచ్‌లు నాగేందర్, కృష్ణ, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

సమ్మెకు దిగిన కార్మికులు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీఎస్ ప్రైవేట్ కంపెనీలో థర్డ్‌పార్టీ కోల్ షాంప్లింగ్ కార్మికులు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కోల్ షాంప్లింగ్ కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయల బిక్షం, ఉపాధ్యక్షుడు సురేందర్, సీతారాములు, అంజత్ ఖాన్, సందీప్, రాంబాబు పాల్గొన్నారు.

నేడు సామూహిక వివాహాలు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో ధాన ధర్మ ట్రస్ట్, చిన జీయర్ స్వామి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు సుమారు 165 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. చిన జీయర్ స్వామి సమక్షంలో ఈ జంటలకు వివాహ క్రతువును నిర్వహించనున్నారు. ఒక్కో జంటకు రూ.65వేల విలువ చేసే మంగళసూత్రాలు, మెట్టెలు, పెళ్లి వస్త్రాలు, ఇతర సామగ్రి అందించనున్నారు. సామూహిక వివాహాల అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ట్రస్ట్ నిర్వాహకురాలు గంటా రాధ, చిన జీయర్ స్వామి శిష్యుడు దేవదాస్‌లు బుధవారం తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని పలు పేద కుటుంబాలకు ఎస్‌కెటి గ్రూప్స్ చైర్మన్, మణుగూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు, వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దోసపాటి వెంకటేశ్వరరావు–లక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రూ.6వేల విలువ చేసే నిత్యావసర సరుకులను ఎస్‌కేటీ గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి నాగేశ్వరరావు పంపిణీ చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షులు కేశ ప్రసాద్, వనితా వైభవ్ క్లబ్ అధ్యక్షురాలు బొగ్గవరపు అంజలి, శేషుబాబు, నరసింహారావు, బ్రహ్మయ్య, రమేష్‌బాబు పాల్గొన్నారు.

శివ రావు ఆశయాలను సాధిద్దాం

దుమ్ముగూడెం: అమరజీవి కామ్రేడ్ గుడ్ల శివరావు ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సరియం కోటేశ్వరరావు అన్నారు. బుధవారం గుడ్ల శివరావు 12వ వర్ధంతి సందర్భంగా లక్ష్మీనగరం గ్రామంలోని స్తూపంవద్ద పూలమాలలతో చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యలమంచిలి సీతారామయ్య అనుచరులుగా మండలంలో అనేక ప్రాంతాల ఉద్యమ పోరాటలలో పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, సరియం రాజమ్మ, లక్ష్మీ నగరం శాఖ కార్యదర్శి గుడ్ల రామ్మోహన్ రెడ్డి, సీపీఎం మండల కమిటీ సభ్యులు గుడ్ల సాయి రెడ్డి, బేగ్, బేరి వీరేందర్ రెడ్డి, గుడ్ల తాతరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ములకలపల్లి: కార్మిక ఉద్యమ నిర్మాత పర్సా సత్యనారాయణ శతజయంతి సందర్భంగా ఈనెల 31, జూన్ 1వ తేదీన కొత్తగూడెంలో నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో, మధారం నర్సరీ కార్మికుల వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, హమాలీ వర్కర్లు మిరియాల వెంకన్న, నల్లి రామారావు, నల్లి నాగరాజు, సాయికుమార్, లక్ష్మీపతి, వెంకటేశ్వరరావు, లక్ష్మీకాంతం, లక్ష్మీ, రత్తమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

సకాలంలో అందించండి

ములకలపల్లి: రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్రనేత అవునూరి మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్‌డివిజన్ కార్యదర్శి కుంజా కృష్ణ అధ్యక్షతన బుధవారం ములకలపల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జిల్లా సహాయ కార్యదర్శి గోని నాగేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కె.ఉమర్, కొండపనేని కృష్ణయ్య, నవళ్ల ఆదినారాయణ, వంకా సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ముంపుపై ముందస్తు చర్యలేవి?

- భారీ వర్షాలొస్తే అతలాకుతలమవుతున్న మణుగూరు
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు
- ఏటా వానాకాలం ఇదే తీరు


కట్టువాగు బ్రిడ్జి పక్కన పేరుకుపోయిన పిచ్చి చెట్లు


కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురైన వినాయక నగర్ (ఫైల్)

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గానికి మండల కేంద్రంగా ఉన్న మణుగూరు మున్సిపాలిటీ ప్రతీ యేటా వర్షాకాలంలో ముంపునకు గురవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పటికప్పుడు అధికారులు, పాలకులు చర్యలు తీసుకుంటున్నా అవి తాత్కాలికంగా మారడంతో వానాకాలంతో ముంపు సమస్య యథావిధిగా సాగుతోంది. కాల్వల్లోని చెత్త, పిచ్చిమొక్కల తొలిగింపు లేకపోవడంతో ప్రతీ యేటా లోతట్టు ప్రాంతాలతో పాటు కొద్దిపాటి భారీ వర్షాలకు పట్టణం నడిబొడ్డున ఉన్న వార్డులు సైతం ముంపునకు గురవుతున్నాయి. దీంతో వానాకాలం వస్తోందంటేనే భయం గుప్పిట బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఎక్కడి చెత్త అక్కడే..

మున్సిపాలిటీలోని వార్డుల్లో చెత్త తరలించడంలో మున్సిపాలిటీ అధికారులు వైఫల్యం చెందుతన్నారన్న ఆరోపణలున్నాయి. రోడ్లను ఊడ్చేందుకు వినియోగించాల్సిన స్వీపింగ్ మిషన్లు, సక్కింగ్ మిషన్లు నిర్లక్ష్యం నీడన మగ్గుతుండటంతో వాటి బదులు సిబ్బందిని ఆ పనికి కేటాయిస్తూ ప్రధాన రహదారి వెంబడి చెత్త తరలించి చేతులు దులుపుకుంటున్నారు. నాలుగు ట్రాక్టర్లకు ఒక ట్రాక్టర్ మాత్రమే అందుబాటులో ఉండగా, వానకాలం సమీపిస్తున్నా మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మున్సిపాలిటీలో 20 వార్డుల్లో ప్రధానమైన సుందరయ్యనగర్ వంటి వార్డుల్లో మాత్రమే చెత్త సేకరణ జరుగుతోందని మిగతా వార్డుల్లో స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీ కాల్వలు ఎత్తుపల్లాలు బేరీజు వేయకుండా కట్టడంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే దర్శనమిస్తోంది. ప్రధాన రహదారికిరువైపులా ఉన్న కాల్వల్లో పూడిక తీత తీసిన దాఖలాలు లేవు. దీంతో వార్డుల్లో దుర్గంధం వెదజల్లుతున్నాయి. వానకాలంలో రోగాలు ప్రబలే అవకాశం ఉంది.

ముంపు ప్రాంతాలపై పట్టింపు శూన్యం

రెండు సంవత్సరాల క్రితం ఏకధాటిగా కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన వార్డులు నీట మునగగా, అప్పటి ప్రజాప్రతినిధులు సైతం వరదల్లో తిరిగి కాల్వల్లో పూడిక తీసి వరద నీటిని దారి మళ్లించి సహాయక చర్యలు చేపట్టారు. తాత్కాలిక చర్యలతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఏకధాటిగా వర్షాలు పడితే మునకే.

- చెరువు ముందు సింగారం చెరువుకు సమితిసింగారం శివారులో బండ్ కట్టడంతో వర్షానికి చెరువు నిండితే కోడిపుంజుల వాగులో కలవాల్సిన చెరువు వరద ఇటు వైపు మున్సిపాలిటీలోని వినాయకనగర్ పూర్తి ముంపునకు గురవుతోంది. కొద్ది పాటి వర్షానికే మోకాళ్ల లోతు నీరు వస్తుండటంతో వర్షం పడిందంటే బయటకు రాలేని పరిస్థితి వినాయక నగర్ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్నారు.
- ఎగువ ప్రాంతాల వరద గోదావరిలోకి పోటెత్తితే మున్సిపాలిటీలోని గోదావరికి చేరువగా ఉన్న రాయిగూడెం, కమలాపురం, అన్నారం గ్రామాలు జలదిగ్బంధమే.
- పట్టణంలోని ఎస్‌బీఐ పక్కన బ్రిడ్జి, పాత ఆంధ్రాబ్యాంక్ పక్కనే ఉన్న బ్రిడ్జిల్లో ఉన్న పిచ్చిచెట్లను తొలిగించకపోవడంతో పాటు చెత్త తీయకపోవడంతో గత మణుగూరు ముంపు అనుభవం మళ్లీ పునరావృతమయ్యే అవకాశం ఉంది. వానకాలంలో వరద నీరు ఈ పెద్ద కాల్వల ద్వారా సాఫీగా వెళ్లని పక్షంలో గాంధీనగర్, కాళీమాత ఏరియా, సుందరయ్య నగర్, ఆదర్శ నగర్‌లోని మామిడితోట ముంపుకు గురై రహదారికి, రాకపోకలు ఇబ్బందులేర్పడతాయి.
- నేరేళ్ల చెరువు అలుగు పారితే కట్టవాగు నుంచి వచ్చే వరద పోటుకు మున్సిపాలిటీకి అతి చేరువగా ఉన్న చాకలి ఐలమ్మ నగర్ జల దిగ్బందంలో చిక్కుకుని ముంపుకు గురవుతున్నది. వరదను నిలువరించేందుకు ఒకవైపు ప్రహరీతో పాటు బ్రిడ్జి నిర్మించాలని గత మూడు సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు.
- గతేదాది ఓసీ–4 ఓబీ కంపెనీ డంప్ యార్డ్ కట్ట తెగి మణుగూరులోని సీఎస్పీ కాంటా ప్రాంతం ముంపునకు గురవడంతో సింగరేణి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ముంపు నుంచి కాపాడారు. రెండు రోజుల క్రితం కొద్దిపాటి వర్షానికే సీఎస్పీ కాంటా ప్రాంతం ముంపునకు గురై దుకాణాల్లోకి వర్షపు నీరు చేరాయి.

వీధి లైట్లు లేవు...

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వరదలకు కొట్టుకు వచ్చే వివిధ రకాల విష సర్పాల నుంచి వానాకాలంలో విషసర్పాలు కాలంలో వేళ వీధి లైట్ల కొరత తీవ్రంగా బాధిస్తోంది. మణుగూరు మున్సిపాలిటీలో చాలా వార్డుల్లో అక్కడక్కడా వీధి లైట్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ పలుమార్లు మున్సిపాలిటీ కమిషనర్లకు ఫిర్యాదు చేసినా కాంట్రాక్టర్ నుంచి లైట్లు రావడం లేదనే సమాధానం చెబుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇంటి పన్ను వసూలుకు వచ్చే మున్సిపాలిటీ సిబ్బంది చెత్త సేకరణకు, డ్రైనేజీ తీసేందుకు, వీధి లైట్ల మరమ్మతులు చేపట్టరని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. వానకాలం సమీపిస్తున్న వేళ మున్సిపాలిటీలో ప్రధాన కాల్వలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులేర్పడే పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు.

స్పెషల్ లేబర్‌తో ప్రత్యేక చర్యలు



మణుగూరు పట్టణంలోని అన్ని చిన్న కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తీయించడంతో పాటు పిచ్చి చెట్లను తొలిగించాం. ప్రత్యేక వర్కర్లను తీసుకుని ఒక నెల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మురుగు, చెట్లను తొలిగించాం.
– మున్సిపాలిటీ కమిషనర్, ఉమామహేశ్వరరావు

మావోయిస్టుల సమాచారం ఇవ్వండి


దుమ్ముగూడెం: పోలీసులు అంటించిన పోస్టర్ల వద్ద ఏఎస్పీ పరితోష్ పంకజ్

దుమ్ముగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసీల అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తున్న మావోయిస్టుల సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి బహుమతి ఇవ్వడం జరుగుతుందని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. బుధవారం మండల వ్యాప్తంగా నిషేధిత మావోయిస్టుల వాల్ పోస్టర్లను పోలీసులు అంటించారు. నిషేధిత మావోయిస్టులు కుంజ వీరన్న అలియాస్ లచ్చన్న, పూనెం లక్కే అలియాస్ తులసి, కొవ్వాసి రాము, పొడియం కొసయ్య అలియాస్ సుకురాం, దుర్గేష్, కోసి అలియాస్ వెన్నెల, మాసయ్యల సమాచారం తెలిస్తే వెంటనే తెలియపర్చాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: మావోయిస్టులపై ప్రకటించిన రివార్డుల వివరాలతో కూడిన పోస్టర్లను అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు మండలంలో మొండికుంట, సీతరాంపురం, గొంది గూడెం, అశ్వాపురం, మల్లెలమడుగు, మిట్టగూడెం గ్రామాలలో పోస్టర్లు అంటించారు. సంఘ విద్రోహ శక్తుల వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కరకగూడెం: మావోయిస్టుల వ్యవస్థను నిర్మూలిద్దాంమని ఏడూళ్ల బయ్యారం ఎస్సై వెంకటప్పయ్య పిలుపునిచ్చారు. బుధవారం మావోయిస్టుల యాక్షన్ టీంలు, వారిపై ప్రకటించిన రివార్డులు ఉన్న వివరాలతో ఫ్లెక్సీలను పినపాక మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, బస్ స్టేషన్లలో, రద్దీ ప్రాంతాల్లో అంటించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండాల: ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి అడ్డుపడుతున్న మావోయిస్టులకు సహకరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్‌లు అన్నారు. బుధవారం మండలంలోని సాయనపల్లి, వెంకటాపురం, దామరతోగు, గణాపురం తదితర గ్రామాల్లో మావోయిస్టుల ఫోటోలతో ఉన్న వాల్ పోస్టర్లు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మావోయిస్టులను గ్రామాల్లోకి రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలని, వారికి పోలీస్ శాఖ తరుపున పునరావాసం కల్పిస్తామని అన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించండి

గుండాల: మండలంలో నెలకొన్న అభివృద్ధి పనులపై సంబంధిత శాఖా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా దృష్టి సారించాలని ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకాగా ప్రతీ సమావేశానికి హాజరయ్యే అధికారులు నివేధికలు ఇవ్వడం తప్పా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. ఇల్లందు నుంచి ఆర్టీసీ మర్కోడు వరకు నడపాలని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇరిగేషన్‌లో కూడా చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను సూచించారు. వర్షాకాలం ప్రారంభం కానున్నందున సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రేవంత్ సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ కొమరం హన్మంతు, వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, ఎంపీటీసీ సత్యావతి, ఎంపీడీఓ రమాదేవి, డీటీ అనూష, ఎంపీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి

భద్రాచలం: విద్యారంగాన్ని ప్రభుత్వం తన ఆధీనంలోనే ఉంచుకొని విద్యార్థుల అభివృద్ధికి పాటుపడాలని టీపీటీఎఫ్ అధికార మాసపత్రిక ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి అన్నారు. బుధవారం ఆ సంఘం ఆవిర్భవించి పది సంవత్సరాలైన సందర్భంగా పట్టణంలోని కార్యాలయంలో జెండాను జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామాచారి మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేటు శక్తుల నుండి విద్యారంగాన్ని విముక్తి చేసి విద్యారంగం మొత్తం ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచి ఉమ్మడి పాఠశాల వ్యవస్థ ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల బాధ్యులు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, ప్రకాష్ రావు, నాగభూషణం, లక్ష్మి, మల్లయ్య, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య మృతిపై విచారణ జరిపించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మారుతి మెడికల్ కళాశాలలో ఈనెల 23న విద్యార్థి కారుణ్య అనుమానాస్పద మృతి పట్ల అనేక అనుమానాలకు తావిస్తోందని, పక్కా ప్లాన్ ప్రకారమే హత్య జరిగిందని పీడీయస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్, జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అలవాల రాజా మహాజన సోషలిస్ట్ పార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లత డిమాండ్ అన్నారు. భద్రాచలం పట్టణం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయంలో బుధవారం పీడీ యస్‌యూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డివిజన్ కార్యదర్శి శివ ప్రశాంత్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కారుణ్య మృతిని రహస్యంగా కూడా బయటకు పొక్కకుండా కళాశాల యాజమాన్యం తమకు ఉన్న ఆర్థిక రాజకీయ అంగ బలాన్ని ఆసరాగా చేసుకుని కారుణ్య మృతిని తప్పుదోవ పట్టించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. భవిష్యత్తులో మరొక విద్యార్థి ఇటువంటి ప్రమాదకరమైన పరిస్థితులను ఎదుర్కోకుండా చర్యలు చేపట్టే విధంగా ఉండడం కోసమే పీడీఎస్‌యూ, దళిత సంఘాలు కారుణ్య మృతిపై సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఏజెన్సీ దళిత శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, అనుసూచిత్ జాతి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను, కొంచర్ల కుమారి, గద్దల కృష్ణవేణి, ఎస్‌కె.సల్మా, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, పింగళి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


వ్యాపారులకు సూచనలిస్తున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: మండలంలోని రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు కేసులు పెట్టడం జరుగుతుందని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. బుధవారం ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో విత్తన, పురుగుమందుల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఖరీఫ్ ప్రారంభం కానున్నందున రైతులకు అవగాహన కల్పించి నాణ్యమైన విత్తనాలను ఇవ్వాలన్నారు. విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించిన క్రమంలో రైతులకు బిల్లులు కూడా ఇవ్వాలన్నారు. బిల్లులు లేకుండా రైతులు విత్తనాలు తీసుకోవద్దని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు తీసుకోవాలని రైతులను సూచించారు. విత్తనాల ప్యాకింగ్ ఉండాలని, ఏ సమయంలో విత్తనాలు నాటుకోవాలి, ఎప్పుడు పురుగుమందులు, ఎరువులు పిచికారి చేయాలో కూడా రైతులకు అర్థమయ్యేలా సూచనలు చేయాలని తెలిపారు. సమావేశంలో ఎస్సై రతీష్, ఏఎస్సై వెంకటరెడ్డి, స్థానిక విత్తన, పురుగుమందు దుకాణదారులు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

చంద్రుగొండ: రైతుల అవసరాలను ఆసరా చేసుకుని నకిలీ విత్తనలు అంటగడితే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్, ఎస్ఐ మాచినేని రవి హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పోలీస్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదిత డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలని సూచించారు. చంద్రుగొండ, రావికంపాడు, పోకలగూడెంలలో విత్తన దుకాణాల్లో తనిఖీలు సాగాయి.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన కోండ్రు జంపయ్య ఇటీవల తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ అశోక్‌రెడ్డి బాధిత వ్యక్తి జంపయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడారు.

పశువుల రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

అశ్వాపురం: పశువులను అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా మండల పరిధిలోని చింతిర్యాల గూడెం గ్రామంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. పశువులను గోదావరికి అవతల గ్రామాల నుండి మొండికుంట కు తరలించి అక్కడి నుంచి దూర ప్రాంతాలకు తరలించేందుకు తీసుకొస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని కోయనర్సాపురం గ్రామానికి చెందిన ప్రజలు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మడకం జ్యోతి, అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన సోడి వీరయ్యలకు తలో రూ.4వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధితులు ఇద్దరు కూడా నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామస్తులు తలో చెయ్యి వేసి ఆర్థికసాయం అందశారు. బాధిత కుటుంబాలను అదుకునేందుకు ముందుకొచ్చి ఫోన్‌పే నంబర్ 9014523792 ద్వారా అందజేసి అదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రుణాలు మాఫీ చేయాలి

చంద్రుగొండ: రైతులకు సంబంధించిన వ్యవసాయ రుణాలను సత్వరమే మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ ఏఈఓ విజయ్‌కు సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో మెమోరాండం అందించారు. అనంతరం ఉమర్ మాట్లాడారు.

నకిలీ విత్తనాలపై అవగాహన


కరకగూడెం: భర్లగూడెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ తాతారావు

కరకగూడెం: అన్నదాతలు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని మణుగూరు ఏడీఏ తాతారావు సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని భర్లగూడెం,రేగళ్ల గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తింపు ఉన్న విత్తన దుకాణాలలోనే అన్నదాతలు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని, ముందస్తుగా విత్తుకోకుండా నేల పూర్తిగా తడిచిన తర్వాతనే వేయాలని సూచించారు. వరినాటే రైతులు పచ్చిరొట్ట ఎరువుగా జీలుగ, జనుము చల్లుకుంటే ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు.అంతేకాకుండా లూజు విత్తనాలు ఎట్టి పరిస్థితిలో తీసుకోవద్దని పేర్కొన్నారు. ఏఈఓలు ప్రశాంత్,అనిల్ కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ


రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ అధికారులు

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు గ్రామంలో గల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో భూమికి సంబంధించి పట్టా పాసు పుస్తకాలు ఉన్నవారికే కూపన్లు జారీ చేశారు. సదరు కూపన్ల ఆధారంగానే జీలుగులు విత్తనాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మరోవైపు సర్వర్ పదేపదే మొరాయిస్తుండటంతో ఆన్‌లైన్ చేసే ప్రక్రియ ఆలస్యమైంది. పచ్చిరొట్ట విత్తనాలు తొలివిడతగా 30 కేజీలవి, 415 సంచులు మాత్రమే మండలానికి వచ్చాయి. దీంతో విత్తనాలు తమకు దొరకవేమోనని రైతులు ఆందోళన పడ్డారు. మండలానికి 35 టన్నుల విత్తనాలు అవసరం ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు డిమాండ్ పెట్టగా ప్రభుత్వం పండెండున్నర టన్నులు మాత్రమే విడుదల చేసింది. డిమాండ్ మేరకు విత్తనాలు సరఫరా చేయడంతో ప్రభుత్వం విఫలమైందని రైతుసంఘాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల అవసరాల మేరకు విత్తనాలు సరఫరా చేయాలని రైతుసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు


ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం పివికాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను ఆయన సందర్శించి పరిశీలించారు. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడులకు సింగరేణియులు, వారి కుటుంబ సభ్యులు, పురజనులు భారీ ఎత్తున హాజరయ్యే అవకాశం ఉందని, వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలన్నారు. స్టాల్స్ ఏర్పాటు చేసుకోదలచని వారు ఈ నెల 31వ తేదీ లోపు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.శ్యాంసుందర్, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, కేపీయూజీ పీఓ వీరభద్రరావు, డీజీఎం(పర్సనల్) రమేష్, సీనియర్ పీఓ సింగు శ్రీనివాస్, ఈఈ (ఎలక్ట్రికల్) శోభన్‌బాబు, ఈఈ(సివిల్) ప్రవీణ్ కుమార్, సర్వే అధికారి సర్వర్ నబి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన


అశ్వారావుపేటరూరల్: తిమ్మాపురం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: పలు గిరిజన గ్రామాల్లో బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని గోపన్నగూడెం గ్రామంలో పర్యటించి, ఇటివలె జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన కబాడీ గంగరాజు పూరిల్లు దగ్ధం కాగా పరిశీలించి ప్రభుత్వం ద్వారా పక్కా ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. అలాగే కంట్లం గ్రామానికి చెందిన మడకం కామరాజు అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందగా, మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిమ్మాపురం గ్రామంలో పర్యటించి గ్రామ సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జమ్మిగూడెం, వేదాంతపురం, పేరాయిగూడెం గ్రామాల్లో పర్యటించి అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని పరామర్శించి, ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. అదే విధంగా ఇటివలె రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఓ పత్రికా విలేకరి రాజశేఖర్‌ను పరామర్శించారు. అనంతరం అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించడంతోపాటు, ప్రయాణీకులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, తుమ్మా రాంబాబు, నార్లపాటి రాములు పాల్గొన్నారు.

దమ్మపేట: మండలంలోని గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దమ్మపేట మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున బొల్లికొండ జయలక్ష్మి అనారోగ్య కారణంగా మృతి చెందారు. బుధవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, పట్వారిగూడెం గ్రామంలో జయలక్ష్మి భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన ఎస్తేరు రాణి చిత్రపటానికి పూలతో నివాళులర్పించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాచూరుపల్లి గ్రామంలో గ్రామస్తులతో మమేకమైన ఎమ్మెల్యే, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి, మెరుగైన వైద్యం అందించేలా తన వంతుగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.